క్లుప్తంగా

మూతపడ్డ టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్ట్



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ ఐలాండ్‌కు వచ్చే పర్యాటకుల భద్రత కోసం మూడేళ్ల కిందట ఏర్పాటు చేసిన టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టు క్యాబిన్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ)కు చెందిన హరిత బరంపార్క్ (పున్నమి హోటల్)లో ఈ అవుట్‌పోస్టును ఏర్పాటు చేశారు. భవానీ ఐలాండ్‌లో నేరాలు, ప్రమాదాలు జరిగినా వెంటనే స్పందించి చర్యలు తీసుకునే లక్ష్యంతో ఇది ఏర్పాటైంది. పర్యాటకం పేరుతో భవానీ ఐలాండ్‌కు వచ్చి పోయే వారిలో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం, లగేజీని తనిఖీ చేయడం, విచారించడం చేస్తుండేవారు. కొన్నాళ్లు పోలీసులు హడావుడి చేశారు. ఆ తర్వాత ఎంత అట్టహాసంగా ప్రారంభించారో అంతే గుట్టుచప్పుడు కాకుండా మూసి వేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం శ్రీ వారి భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. ఉమ్మడిశెట్టి సీతా రామయ్య, వేంకటలక్ష్మి, దుర్గాప్రసాద్, సునీత, విజయదుర్గ, సత్యనారాయణ మూర్తి, రమాదేవి, శ్రీనివాసమూర్తి, సీతారావమ్మ ఆధ్వర్యంలో 300 మందికి అన్నప్రసాదం అందించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి మాట్లాడుతూ టీటీడీ అధికారుల సూచనతో వారంలో మూడు రోజులపాటు అన్నప్రసాదం అందిస్తున్నామన్నారు. దాతలు ప్రసాద వితరణకు సహకరించాలని కోరారు. వివరాలకు టీటీడీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సింధూరం ఆకు పూజలు నిర్వహించారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి పాతూరి లోకేశ్వరి పర్యవేక్షించారు.

నేడు డాక్టర్ మంగళంపల్లి జయంతి

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సంగీత విద్వాంసుడు, వాగ్గేయకారుడు డాక్టర్ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ జయంతి సమితి కార్యలయంలో నిర్వహిస్తునట్లు ప్రధాన కార్యదర్శి సీవీ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యువ సంగీత విద్వాంసులతోపాటు సంగీత రంగంలో వివిధ శాఖలకు చెందిన వారు పాల్గొనవచ్చన్నారు.

మినీ మార్ట్‌ల పేరుతో చీటింగ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ కంపెనీకి విజయవాడ పరిసరాల్లో మినీ మార్ట్‌లు ఏర్పాటు చేసి ఫ్రాంచైజీ ఇస్తామని మెడికల్ వ్యాపారిని మోసం చేసిన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. భవానీపురానికి చెందిన కేసరి సుబ్బారెడ్డి సత్యనారాయణపురంలో మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సరఫరా చేసే సుబ్బారావు అనే వ్యక్తి ఈ ఏడాది మార్చి నెలలో కాణిపాకం అనిల్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. అనిల్ తాను జార్ఖండ్‌కు చెందిన లీలా మార్ట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి సీఈఓనని పరిచయం చేసుకున్నాడు. రిలయన్స్, డీ మార్ట్ వంటి వాటికి ప్రొవిజన్స్ సరఫరా చేస్తామని చెప్పాడు. తమ కంపెనీ విజయవాడ పరిసరాల్లో 17 మినీ మార్ట్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలిపాడు. ఔత్సాహికులకు ఫ్రాంచైజీలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. మార్ట్ రెంట్, స్టాఫ్ జీతాలు కంపెనీ భరిస్తుందని, కంపెనీకి ష్యూరిటీగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తే స్టాక్ పంపుతామని నమ్మించాడు. స్టాక్ అమ్మిన తర్వాత కమీషన్ తీసుకుని మిగిలిన సొమ్ము చెల్లించాలని చెప్పాడు. అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించాడు. అంబాపురం వద్ద ఓ మార్ట్ కు తీసుకెళ్లి ఇది ఫ్రాంచైజీ ఇచ్చామని నమ్మించాడు. నమ్మకం కుదిరిన సుబ్బారెడ్డి పలు చోట్ల మార్ట్‌లు ఏర్పాటుకు అవసరమైన భవనాలు చూశాడు. జీఎస్టీ తీసుకున్నాడు. ఫోన్ పే, బ్యాంకు , నగదు రూపంలో మొత్తం రూ.51.85 లక్షలు చెల్లించాడు. వారం రోజులుగా అనిల్ ఫోన్ ఎత్తడం లేదు. ఇతరులను ఆరా తీయగా వారి ఫోన్‌లు కూడా ఎత్తడం లేదని చెప్పారు. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న సుబ్బారెడ్డి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కలవరపెడుతున్న ఖాళీ స్థలాలు

- మెరక చేయించటంలో అధికారులు విఫలం
- నిత్యం నీటితో నిండిపోతున్న వైనం
- భయాందోళనలో స్థానికులు



జీవీఆర్‌నగర్‌లో చెరువును తలపిస్తున్న ఖాళీ స్థలం



ఖాళీ స్థలాల్లో పెరిగిపోయిన జమ్ము, పిచ్చి మొక్కలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయక నగర్, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో నీటితో నిల్వ ఉండి ప్రజలను కలవర పెడుతున్నాయి. వర్షపునీరు బయటకు పోయే మార్గం లేదు. స్థానికులు వాడిన మురుగునీరు సైతం ఖాళీ స్థలాల్లో నిలిచిపోతున్నాయి. దీంతో ఇక్కడ ఖాళీ స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. మురుగు, వర్షపునీరు నిలిచిపోవటం వల్ల పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలు, క్రిమికీటకాలకు ఆవాసకేంద్రంగా మారుతున్నాయి. దీంతో రాత్రిపూట బయటకు రావాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు.

మెరక చేయించటంలో నిర్లక్ష్యం....

ఖాళీ స్థలాలను మెరక చేయించాల్సిన అధికారుల నిర్లక్ష్యం ప్రజారోగ్యానికి భంగంగా మారింది. రియల్టర్లు, వ్యాపారులు స్థలాలను కొనుగోలు చేసి ఖాళీగా వదలివేస్తున్నారు. రేటు పెరిగినపుడు చూద్దామంటూ కనీసం ఈ స్థలం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. మురుగునీరు పేరుకుపోవటమే కాకుండా దోమల పెరుగుదలకు దోహదపడుతున్నాయి. వీటిపై అధికారులు, ప్రజారోగ్య శాఖ అధికారులు స్పందించి మెరక చేయించాలని జనం కోరుతున్నారు. చిన్నపాటి ఖాళీ స్థలాలు ఉన్న ఇంటి యజమానులను మాత్రం అధికారులు ముక్కుపిండి మరీ ఖాళీ స్థలాల్లో మెరక చేయిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న స్థలాల్లో అధిక భాగం బడా వ్యాపారులు, రియల్టర్‌లదే కావటం విశేషం.

రోకటి పోటులా రైల్వే ఖాళీ స్థలాలు...

పుండుమీద రోకటిపోటులాగా ఇక్కడి రైల్వే ఖాళీ స్థలాలు స్థానికులను కలవరపెడుతున్నాయి. దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ సమీపంలోని రైల్వేఖాళీ స్థలాలు నిత్యం నీటితో నిండిపోయి ఉంటున్నాయి. ఎక్కడైనా వేసవిలో నీరు లేకుండా పోతుందేమో కానీ ఇక్కడ మాత్రం 365 రోజులూ నీరు నిలిచే ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

ఇళ్లలోకి చొచ్చుకొస్తున్న విషసర్పాలు....

ఖాళీ స్థలాల వల్ల విషసర్పాలు కూడా పెరిగిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనివల్ల రాత్రిపూట బయటకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నామని వాపోతున్నారు. విషసర్పాలు ఇప్పటికే పలుమార్లు ఇళ్లలోకి ప్రవేశించాయని దీనివల్ల తమకు రక్షణ కరువయిందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

10న గురు పూర్ణిమ మహోత్సవం



గురుపూర్ణిమ మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు షిర్డీసాయి బాబా మందిరంలో ఈ నెల 10వ తేదీ గురువారం గురుపూర్ణిమ మహోత్సవంను ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మందిర గౌరవాధ్యక్షులు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన శ్రీ గురుపూర్ణిమ మహోత్సవ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన శక్తిసంపన్నులు సద్గురువు శ్రీసాయినాథుడు అన్నారు. సాయి బంధువులు బాబావారి మందిరంలో శ్రీగురు దత్తాత్రేయస్వామి సన్నిదిలో జరిగే గురుపూర్ణిమ మహోత్సవాల్లో పాల్గొని బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. 10వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు కాకడ హారతితో గురుపూర్ణిమ ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనము, పంచామృతములతో సహస్ర కలశాభిషేకం,శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నాలుగు గంటలకు ఒక్కసారి బాబావారికి దత్తాత్రేయ స్వామివారి విశేష అర్చనలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. అలాగే గురుపూర్ణిమ మహోత్సవం పురస్కరించుకుని సద్గురువులకు సత్కారం చేయటం జరుగుతుందన్నారు. భక్తులు బాబావారిని దర్శించుకుని ఆయన కృపకు పాత్రులు కావాలని కోరారు. మందిర అధ్యక్షులు పొన్నలూరి లక్ష్మణరావు, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ప్రతి ఒక్కరి బాధ్యత



భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అన్నిదానాల్లోకెల్లా అన్నదానం మిన్న అని ఆకలితో ఉన్నవారి కడుపు నింపటం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని లయన్ గవర్నర్ పీఎంజేఎఫ్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. రామకృష్ణాపురం దుర్గాదేవి దేవాలయం వద్ద శనివారం లయన్స్ మల్టీ సర్వీస్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఇమేజ్ ఆధ్వర్యాన లయన్స్ గవర్నర్ పిలుపు మేరకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదానంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కడుపు నింపే విధంగా ఏడాది పొడవునా అన్నదానం చేయాలని సూచించారు. ఇప్పుడు అన్నదానం చేసిన డీసీఎస్ ట్రస్ట్ చైర్మన్ రామారావును అభినందించారు. ఇక్కడ మరో రెండ్రోజుల పాటు అన్నదానం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ కోశాధికారి క.మాధవీలత తెలియ చేశారు. అనంతరం భోజనాలు వడ్డించారు. తొలుత ఆలయంలో పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ ప్రసాద్ , శ్రీనివాస రెడ్డి, జీవీఎస్ శర్మ, లయన్స్ క్యాబినెట్ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్ కేవీ రామారావు, శశిధర్. శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షులు పద్మజ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు శాకంబరీ అలంకారం



శాకంబరీ అలంకారంలో అమ్మవారు



వారాహీ అమ్మవారు



వారాహీ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం శ్రీ అలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో శనివారం అమ్మవార్లకు శాకంబరీ అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే శ్రీ వారాహీ నవరాత్రులు అనంతం వారాహీ మాతకు భక్తులు ఊంజలసేవ నిర్వహించారు.

బీజేపీ ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పణ



విజయవాడలీగల్: ఆషాఢ మాసం నేపథ్యంలో బెజవాడ బార్ అసోసియేషన్ మహిళా సభ్యులు ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన దుర్గమ్మకు శనివారం ఆషాఢసారె సమర్పించారు. కనకదుర్గమ్మ దయ న్యాయవాదులు, కక్షిదారులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కనకదుర్గమ్మకు ప్రీతి కలిగించే విధంగా బెజవాడ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో పూజలు నిర్వహించారు. అనేకమంది మహిళా న్యాయవాదులు పాల్గొని అమ్మకు సారె, చీరలు, గాజులు, పసుపు కుంకుమ గాజులు సమర్పించారు. మాజీ బీజేపీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా ప్రత్యక్ష పర్యవేక్షణలో అనేక మంది బ్రాహ్మణుల మంత్రోచ్చారణల నడుమ, కోలాట నృత్యాల సందడితో జరిగింది. కార్యక్రమంలో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ రెహానా బేగం, స్టేట్ బార్ కౌన్సిల్ సెక్రటరీ పద్మలత, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి, బార్ అధ్యక్షుడు ఏ కె బాషా , ఉపాధ్యక్షుడు శ్రీనివాస రావు, జాయింట్ సెక్రటరీ వరాహలక్ష్మి, మహిళా న్యాయవాదులు , న్యాయ మూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాహ్మణులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సామాజిక వర్గం కులవృత్తిపైనే ఆధారపడకుండా వ్యాపారవేత్తలుగా తయారు కావాలని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఫిల్మ్ చాంబర్ హాల్లో శనివారం బ్రాహ్మణ వ్యాపారుల ఎగ్జిబిషన్‌ను మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వృత్తికే పరిమితమైతే ఆర్థికాభివృద్ధి సాధ్యం కాదన్నారు. కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని, వ్యాపార రంగంపై పట్టు సాధించాలని సూచించారు. యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో పూజా సామగ్రి, సోలార్ పవర్, ఆయుర్వేద ఉత్పత్తులు, టప్పర్ వేర్, రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్ , బిజినెస్ లోన్స్ , జూట్ బ్యాగ్స్, ఫర్నిచర్, డివోషనల్ పుస్తకాలు ఇలా 70 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ లో నాణ్యమైన ఉత్పత్తులు డిస్కౌంట్ ధరలకే లభిస్తున్నందున ప్రజలు సందర్శించి ప్రోత్సహించాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ



మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం ఆధ్వర్యాన ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులు, ఐదుగురు కళాశాల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు ఏటా మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న అల్లూరి సీతారామరాజు స్మారక గ్రంథాలయం కమిటీ సభ్యులను అభినందించారు. అలాగే పదోతరగతి పరీక్షలలో నూరుశాతం ఫలితాలు సాధించటానికి కృషి చేసిన ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు, సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుబ్బరాజు, దాట్ల భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



వేదికపై ఏసీపీలు, అతిథులు, స్కూల్ యాజమాన్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జ్ఞానంతో తమ జట్టులను నడిపిస్తూ జయాపజయాలను స్వీకరించి దృఢసంకల్పంతో ముందుకు వెళ్లేవాడే నిజమైన లీడర్ అని.. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవడం ఉత్తమమని పలువురు వక్తలు తెలిపారు. సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ స్కూల్‌లో 'ఇన్వెస్టిచర్ వేడుక' శనివారం ఘనంగా జరిగింది. నార్త్‌జోన్ ఏసీపీ కె.స్రవంతిరాయ్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ కె.లతాకుమారి, సౌత్ జోన్ ఏసీపీ డి.పవన్‌కుమార్, విజయవాడ సోషల్ అపోస్తలేట్ కౌన్సిలర్ ఇన్‌చార్జ్ సిస్టర్ సుగుణ ఫ్రాన్సిస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలను అలవర్చడం ఎంతో ముఖ్యమన్నారు. నాయకుడంటే ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా, ఎన్ని అపజయాలు కలిగినా తమ జట్టును ముందుండి నడిపిపించాలని చెప్పారు. మొక్కవోని దీక్షతో విజయ శిఖరాలకు చేరుకునేలా చేసేవాడే నిజమైన నాయకుడని పేర్కొన్నారు. స్కూల్స్‌లో కూడా విద్యార్థులకు చిన్ననాటి నుంచే ఇలా నాయకత్వ లక్షణాలు నేర్పించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం స్కూల్ నూతన విద్యార్థి మండలికి ఎన్నికైన నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా స్కూల్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ఆడి పాడి సరదాగా గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ ఆశాజార్జ్, కరస్పాండెంట్ సిస్టర్ జెస్సీ థామస్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నగరంలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



కృష్ణలంక(విజయవాడతూర్పు): నగర ప్రజలకు దేశం నలుమూలల నుంచి తెచ్చిన విశిష్ట దుస్తులను అందించేందుకు బందరు రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–ఎగ్జిబిషన్ కమ్ సేల్ వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నామని ఆర్గనైజర్ జయాస్ గుప్తా తెలిపారు. ఈ ప్రదర్శనలో వేలాది రకాల పట్టు, కాటన్ డిజైన్ దుస్తులు, డిజైనర్ చీరలు, బ్లౌజ్‌లు, కుర్తీలు వంటివి దేశంలోని నేత కార్మికుల ద్వారా 50 శాతం వరకు తగ్గింపుతో ఒకే చోట విక్రయిస్తున్నామని చెప్పారు. ఈ నెల 4వ తేదీన ప్రారంభమైన ఈ ప్రదర్శన 7వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటలకు ఉంటుందన్నారు.

ఆగస్టు 3న బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం నేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 3న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామని సేవా సంఘం అధ్యక్షుడు కొప్పవరపు వెంకట బలరామ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం సత్యనారాయణపురంలోని సేవా సంఘం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో ఆగస్టు 3న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఈ పరిచయ వేదికలో వధూవరులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన వారు సెల్: 98485 36386, 98481 48258 నంబర్‌లలో గాని, సత్యనారాయణపురంలోని శ్రీ జగద్గురు శృంగేరి పాదుకా క్షేత్రంలోని తమ కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం పరిచయ వేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తణుకు రామకృష్ణ, పెద్దిబొట్ల కాశీవిశ్వనాథం, ఈమని శ్రీరామచంద్రమూర్తి, కొప్పవరపు మారుతి పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శిగా చరిత్ర

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ దుర్గాప్రసాదరావు



భువన విజయం గ్రంథం ఆవిష్కరిస్తున్న జస్టిస్ దుర్గాప్రసాద్, బుద్ధప్రసాద్, మల్లికార్జున రావు

విజయవాడ కల్చరల్: చారిత్రక సంఘటనలు భావి తరాలు గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హైపవర్ కమిటీ చైర్మన్ జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు తెలిపారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు రచించిన భువన విజయం రాయలనాటి కథలు.. గాథలు గ్రంథావిష్కరణ అభిమానుల సమక్షంలో హోటల్ ఐలాపురంలో శనివారం నిర్వహించారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ చరిత్ర భావితరాలకు మార్గదర్శిగా ఉండాలని సూచించారు. రాయలు చరిత్ర తరగని గని అని అభివర్ణించారు. భువన విజయం చారిత్రక పరిశోధకులకు ఉపయుక్తమైన గ్రంథమని చెప్పారు. ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారి చరిత్రలో స్వర్ణయుగం రాయలు పాలనాకాలం అని గుర్తుచేశారు. తెలుగు జాతిని భాషా పరంగా ఏకం చేయకలగిన శక్తి రాయల కాలానికే మాత్రమే ఉందన్నారు. ఏపీ సృజనాత్మక సమితి సీఈవో ఆర్.మల్లికార్జునరావు సభకు అధ్యక్షత వహించారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు భువన విజయంలోని అంశాలను వివరించారు. రచయిత డాక్టర్ జీవీ పూర్ణచందు, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు అండగా వైఎస్సార్ సీపీ

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లాది విష్ణు, రవిచంద్ర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలంటూ ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వైఎస్సార్ సీపీ, సీపీఐ, సీపీఎంలు మద్దతు ఇచ్చాయి. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ స్పందించి తక్షణమే శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకొని డాక్టర్లుగా తిరిగి వచ్చిన వైద్య విద్యార్థులకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేయకుండా ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని వారి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. గత 13 నెలలుగా ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వకుండా ఉండడం సరికాదన్నారు. వెంటనే వారందరికీ శాశ్వత రిజిస్ట్రేషన్‌పై సంతకం చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కలుపుకొని ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. శాంతియుతంగా తమ న్యాయమైన సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేస్తున్న వారిపై పోలీసులు బలప్రయోగం చేసి హడలెత్తించారు. ఆడపిల్లలని కూడా చూడకుండా చావబాదారు. ప్రజలకు సేవ చేయాల్సిన డాక్టర్లు ఈరోజు రోడ్లపై నిరసనలు చేయాల్సి రావడం బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయికుమార్, పీడీఎస్‌యూ నాయకులు రాజేష్ ,వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

పాండురంగడి కల్యాణోత్సవాలు ప్రారంభం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం (కొత్తగుళ్లు) ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి కల్యాణోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం రుక్మాబాయి సమేత పాండురంగస్వామి వారి మూల మూర్తులకు పంచామృత తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ఫల, పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. ఆలయంలో కొలువైన సంతాన వేణుగోపాలస్వామి వారికి కూడా తిరుమంజన కార్యక్రమం జరిగింది. అనంతరం స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి నూతన వస్త్రాలను సమర్పించారు. స్వామి వారిని పెండ్లికుమారునిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఊంజల్ సేవ నిర్వహించారు. ఆలయంలో భజన భక్త బృందం ఆధ్వర్యంలో సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, కమిటీ సభ్యులు, ఉభయదాతలు పాల్గొన్నారు.